# ప్రమీల పెళ్ళి

కళ్యాణమండపానికి అరఫర్లాంగు దూరంలోనే ఆటో దిగిపోయాను. అరఫర్లాంగు పొడవునా పచ్చని పందిట్లో తెల్లటి ట్యూబులైట్లు వరుసగా వెలుగులు విరజిమ్ముతున్నాయి. చిన్నచిన్న రంగురంగుల దీపాల తోరణాలు పరిసరాల్ని వింతగా వెలిగిస్తూ మిరుమిట్లు గొలుపుతున్నాయి. రాత్రి ఏడుగంటలు. సమయానికి బస్సు అందడం వల్ల ముహూర్తానికి రెండు గంటలు ముందే చేరుకున్నాను. మండపం గేటు ముందు 'ప్రమీల వెడ్స్ శ్రీనివాస్' అన్న అక్షరాలు రెండు ప్రేమ చిహ్నాల మధ్య అందంగా వెలుగుతూ ఆరుతూ చూపరుల్ని ఆకట్టుకుంటున్నాయి. పరికిణీ - ఓణీల్లో ఉన్న ఇద్దరు అమ్మాయిలు అతిథులపై పన్నీరు జల్లుతూ గులాబీలు అందిస్తున్నారు. ఒకవైపు ఎరుపు తెలుపు దుస్తుల్లో ఉన్న బ్యాండుమేళం విపరీతమైన వాద్యఘోషతో ఇటీవలి సినిమా పాటని హోరెత్తిస్తోంది. పెళ్ళి జరిగే వేదిక, అలంకరించిన పూలగుత్తులతో జలతారు నగిషీలతో.. వెలుతురు జలపాతంలా వెలిగిపోతోంది.

పెళ్లి అర్భాటంగానే చేస్తున్నాడు పరమేశం. ఎక్కడున్నాడో వీడు కన్యాదాత..? ముందు వాడ్ని పట్టుకుని హాజరు వేయించుకోవాలి'.

మనసులో చిన్నగా నవ్వుకుంటూ మండపం వరండాలోంచి నడిచి ఎడమవైపు చూశాను. అక్కడ జనం గుంపులు గుంపులుగా పోగయి ఉన్నారు. 'బఫే' డిన్నరు జరుగుతోంది. జనం ప్లేట్లతో ఎగబడుతున్నారు. అటువైపుగా అడుగులు వేశాను. ఒక గుంపు మధ్య పరమేశం పంచెకట్టులో అరుస్తూ ఆరాటపడుతూ కనిపించాడు. అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాడు. నన్ను చూసి ఆత్మీయంగా కౌగలించుకున్నాడు.

'ఏరా ! ఇదేనా రావడం?' చెల్లాయేదిరా? ఇద్దర్నీ రమ్మని ఫోనులో మరీమరీ చెప్పాను కదరా!' నిష్టూరంగా నిలదీశాడు.

"నా తప్పేంలేదురా కాళ్ళ నొప్పులు, కీళ్ళనొప్పులు కదల్లేనంటూ మీ చెల్లెలే చివరి క్షణంలో చతికిలపడిపోయింది." సంజాయిషీ ఇచ్చుకున్నాను.

"తనుకూడా వస్తే బావుండేది కదరా! సర్లే! భోజనం చేసేయ్. ఒక పనయిపోతుంది. తర్వాత మాట్లాడుకోవచ్చు. అవతల పెళ్ళికొడుకు తరపు బంధువులందరికీ ప్రత్యేకంగా భోజనాలు పెట్టించాలి" పరమేశం ఒక ప్లేటు తీసుకుని, అందులో భోజన పదార్థాలు వడ్డన చేయించి నా చేతిలో పెట్టి, అక్కడ్నుంచి హడావిడిగా వెళ్ళిపోయాడు. నేను కాస్త ఎడంగా జరిగి, కుర్చీ ఒకటి లాక్కొని... తీరికగా భోజనానికి ఉపక్రమించాను. ఓ జులపాల కుర్రాడు అటుఇటూ తిరుగుతూ భోజనం చేసే అతిథుల్ని తన వీడియో కెమెరాలో బంధిస్తున్నాడు.

ఆ కుర్రాడి కెమెరా వెలుగును తట్టుకోలేక ముఖం తిప్పుకున్నాను. రాత్రి వేళ అర్ధ భోజనమే మంచిదనుకుంటూ... నెమ్మదిగా పలావు మెతుకుల్ని కెలుకుతున్నాను. పరమేశం, నేనూ ఒకే ఊరివాళ్ళం. ఒకే వీధివాళ్ళం, జీవనపోరాటంలో చదువు, ఉద్యోగ ప్రయత్నాల్లో సరిసమాన అవస్థలు పడ్డవాళ్ళం. ఎలాగైతేనేం ఇద్దరం ఉద్యోగపర్వాల్లో స్థిరపడ్డాం. పరమేశం, ఒక గుమాస్తాగా, నిస్సారమైనకేంద్ర ప్రభుత్వ శాఖలో కుదురుకున్నాడు. నేను అధ్యాపకవృత్తి శిక్షణపొంది, అంచెలు అంచెలుగా సాగి ఇదిగో ఇప్పుడు ఒక జూనియర్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నాను. పరమేశానికి ముగ్గురూ ఆడపిల్లలే. ముగ్గురూ ముత్యాల్లాంటి పిల్లలు. తల్లి అందాన్ని పుణికి పుచ్చుకున్నవాళ్ళు. అన్నిట్లోనూ చదివినంతవరకూ ఫస్టుమార్కులే తెచ్చుకున్నారు. కానీ పరమేశం ఆడపిల్లలకి పెద్దచదువులు చెప్పించడం శుద్ధ దండగమారి పని అంటూ పెద్ద పిల్లని'ఇంటరు' చదువుతో ఇంట్లో కూర్చోబెట్టాడు. పెద్ద పెద్ద చదువులు చదివించినకొద్దీ.... ఈ ఆడపిల్లలకి పెద్ద సంబంధాలు చేయాల్రా! తనకా శక్తి లేదంటూ మథనపడేవాడు పరమేశం. మొదట్నుంచీ చాదస్తపు భావాలు ఉన్నవాడే. ఆడ మగ వివక్ష, తేడా, సృష్టిలోనే స్పష్టంగా ఉందనేవాడు. చదువులోనూ, ఉద్యోగాల్లోనూ, స్వేచ్ఛలోనూ ఆడవాళ్ళు వెనుక ఉంటేనే సమాజానికి అందం, ఆనందం అనేవాడు. ఏదో ఉద్యోగ ఇబ్బందివల్ల, ఆరోగ్యలోపం వల్ల అంతటితో సరిపెట్టుకున్నాడు గాని, పున్నామ నరక ప్రయత్నంలో,పుత్రరత్నంకోసం ప్రయాసపడి భంగపడ్డవాడే. పెద్ద పిల్ల ప్రమీల. తండ్రి చదువు మానిపించినప్పుడు చాలా గొడవ పెట్టింది. ఏడ్చింది. నన్ను చెప్పమని బ్రతిమాలింది. నేను పరమేశం భావాల్ని మార్చలేకపోయాను.

"ఈ రోజుల్లో ఆడవాళ్ళు అన్ని ఉద్యోగాలు చేస్తున్నార్రా, ఎన్నో విజయాలు సాధిస్తున్నార్రా'' అంటే -

"ఎన్ని ఉద్యోగాలు చేసినా, ఏది వెలగబెట్టినా పెళ్ళే కదరా ఆడపిల్లకి పరమావధి" అంటూ నా నోరు మూయించేవాడు.

అలాంటి పరమేశం ఇదిగా ఇప్పుడు పెద్దపిల్ల ప్రమీల పెళ్ళి చేస్తున్నాడు. ఇద్దరూ వందమైళ్ళదూరంలో ఉన్నా నెలకోసారన్నా చిన్ననాటి స్నేహాన్ని, సాన్నిహిత్యాన్ని నిలుపుకుంటూ ఫోన్లో మాట్లాడుకుంటాం. ఆ మధ్య ఫోనులో ప్రమీలకు మంచి సంబంధం కుదిరిందిరా! అబ్బాయి సరదాగా ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. వాళ్ళు బాగా స్థితిమంతులే. ముగ్గురు అన్నదమ్ముల్లో ఈ అబ్బాయి ఆఖరువాడు. ఇద్దరన్నయ్యలకు పెళ్ళిళ్ళయిపోయాయి. కట్నం ఏమీవద్దన్నారు. లాంచనాలు, పెళ్ళి ఘనంగా జరిపితే చాలన్నారు. నేను లాంఛనాలుగాక, ఒకలక్షరూపాయలుకట్నం రూపేణా ఖర్చుల నిమిత్తం సరిపుచ్చుకోమని ఇచ్చి వచ్చాను. నిశ్చితార్థం జరిగిపోయినట్టే. మన అమ్మాయిని అబ్బాయి ఏదో పెళ్ళిలో చూసి వివరాలు అడిగాడట. అమ్మాయి అందం అబ్బాయికి బాగా నచ్చిందట. మోజుపడి, ఇష్టపడి పెళ్ళంటూ చేసుకుంటే మన అమ్మాయినే చేసుకుంటానని పట్టుబట్టాడట. ఇదంతా ప్రమీల అదృష్టం అనుకో.'

పరమేశం పరమ సంతోషంగా చెప్పాడు. అభినందనగా వాడి సంతోషంలో నేనూ పాలుపంచుకున్నాను. కలవారి కోడలు కావడం ప్రమీల అదృష్టమే మరి!

వీడియో కుర్రాడు మళ్ళీ నా వైపు తిరగడంతో వెల్లువలా కాంతి ముఖం మీద పడింది. ఆలోచనలన్నీ విదిలించుకుని త్వరత్వరగా భోజనం ముగించి, 'బఫే' డిన్నరు నుంచి బయటపడ్డాను.

బ్యాండుమేళం శబ్దఘోష ఎందువల్లనో ఆగిపోయింది. వరండాలోని సన్నాయిమేళం అన్నమయ్య కీర్తన కమ్మగా వినిపిస్తోంది. తాంబూలం నములుతూ కళ్యాణమండపం లోపలికి నడిచాను. నా అర్ధభాగాన్ని, కనీసం పిల్లల్ని కూడా తీసుకురానందుకు పరమేశం భార్య మహాలక్ష్మి నన్ను ముద్దాయిగా నిలబెట్టింది. పెళ్ళికూతురు ప్రమీల అలంకరణలో ముచ్చటగా, ముగ్ధమనోహరంగా ఉంది.

'ఏమ్మా పెళ్ళికూతురివయిపోయావ్? చదువు సాగలేదు. ఉద్యోగం చేస్తావా? నీ ఇష్టానికి తగ్గట్టుగా పెళ్ళయిన తరువాత మీ ఆయన్ని సాధిస్తావా?' నవ్వుతూ మేళమాడాను. ప్రమీల నవ్వింది... ఆనవ్వులో జీవం లేదు.

పెళ్లికొడుకును చూడాలనిపించి అతని విడిది గదులవైపు నడిచాను. శ్రీనివాస్ కాస్త బొద్దుగా ఉన్నా నిజంగా అందంగా, హుందాగా ఉన్నాడు. అతని చుట్టూ పదిమంది వరకూ స్నేహబృందం ఎగిసిపడుతూ కబుర్లు చెబుతున్నారు. ఏవో జోకులు వేస్తున్నారు. తుళ్ళి పడుతూ శీతల పానీయాలు త్రాగుతున్నారు. వాళ్ళ మాటల్లో జోకుల్లో కట్నం గురించిన కబుర్లు వ్యంగ్యంగా వినబడుతున్నాయి. ఒక బాధ్యత గల అధ్యాపకునిగా వాళ్ళ మాటకు మనస్తాపం కలిగినా, పెళ్ళికొడుకుతో కరచాలనం చేసి, పరమేశం స్నేహితునిగా నన్ను నేను పరిచయం చేసుకుని బయటపడ్డాను. వీళ్ళంతా పెళ్ళికాని కుర్రాళ్ళే. ఎవరో ఆడపిల్ల మెడలో తాళి కట్టాల్సిన వాళ్ళే. వీళ్ళల్లో ఎవ్వరికీ స్వంత వ్యక్తిత్వం ఉన్నట్టులేదు. ఏ ఒక్కరికీ తమదైన నిబద్ధత లేదు' మథనపడుతూ హాల్లోకి వచ్చాను.

ముహూర్తానికి సమయం దగ్గర పడుతోంది. భోజనం చేసి అతిథులంతా హాల్లో సర్దుకుని కూర్చుంటున్నారు... డోలు సన్నాయి మేళం 'నీ లీల పాడెద దేవా!' అంటూ వాయిస్తోంది. కళ్యాణ వేదిక ముందు కూర్చున్న పురోహితుడు, ముహూర్తానికి గంటముందే పెళ్ళికొడుకుని పీటల మీదకు తీసుకుని రమ్మని పిలుపునిచ్చాడు. ఒకటి, రెండు, మూడు పిలుపులు వెళ్ళాయి. పెళ్ళికొడుకు పీటల మీదకురాలేదు. పురోహితుడు అటు తరపువాళ్ళని, ఇటు తరపు వాళ్ళని, హెచ్చరించాడు. అయినా పెళ్ళికొడుకు విడిది నుంచి కదిలిరాలేదు.

అదిగో... అప్పుడే అంతమంది పెళ్ళిజనం మధ్య ఆ వార్త ఆటంబాంబులా పేలింది.!

'పెళ్ళి కొడుకు కట్నం కోసం పట్టుబడుతున్నాడట' అదీ ఆటంబాంబు.

'అదేంవిటి? పెళ్ళికొడుక్కి కట్నం ఇవ్వలేదా? ఇస్తే ఎంతిచ్చారు? వాళ్ళు అడిగారా? వీళ్ళు ఇవ్వలేమన్నారా? పెళ్ళికొడుకు ఉద్యోగం చేస్తున్నాడన్నారు. ఆస్తిపాస్తులున్నాయన్నారు. అసలు ఏం మాట్లాడుకున్నారు? మధ్యలో తేడా ఎందుకు వచ్చింది? ఏం జరిగింది?' గుసగుసలు, వ్యాఖ్యానాలు. జనంలో పరమేశం ముఖం పాలిపోయింది. పెళ్ళి పందిరి కళ తప్పిపోయింది. ఆడపిల్లవైపు పెద్దలంతా విడిది ఇంటివైపు కదిలారు. పరమేశంతోబాటు, వికలమైన మనసుతో నేనూ నడిచాను.

"పెళ్ళి కొడుక్కి మూడు లక్షలు కట్నం కావాలి. మరో మాటలేదు." పెళ్ళికొడుకు తండ్రి నిర్మొహమాటంగా అన్నాడు. మౌనం అంగీకారం అన్నట్లుగా పెళ్ళికొడుకు శ్రీనివాస్ పెదవి విప్పలేదు.

"ఏమిటి? ఎందుకిలా మాట్లాడుతున్నారు.? మా వల్ల లోపం ఏమైనా జరిగిందా? చెబితే సరిదిద్దుకుంటాం. కట్నం ఏమిటి? నిశ్చితార్థంలో ఈ మాటలు రాలేదు కదా ? లాంఛనాలు జరిపితే చాలన్నారు. లాంఛనాలుగాక ఒక లక్ష మీకు ముందే ముట్టచెప్పాను. ముహూర్తానికి ముందు ఇప్పుడేవిటిలా?" పరమేశం ప్రాధేయపడుతూ అన్నాడు. అతని కళ్ళల్లో కన్నీళ్ళు ఒక్కటే తక్కువ.

"ముష్టి లక్ష రూపాయలు. ఏదో ఖర్చుల కోసం అంటూ ఇచ్చావులే. మాకు మతిలేక నిశ్చితార్థంలో అడగలేదు. అసలు కట్నం లేకుండా పెళ్ళి ఏమిటి? పెళ్ళికొడుక్కి తన స్నేహితులముందు చాలా చిన్నతనంగా ఉందట. మీరు కట్నం ఇస్తేనే ఈ పెళ్ళి జరుగుతుంది." పెళ్ళికొడుకు తల్లి నిష్కర్షగా చేప్పేసింది.

"ఇప్పటికిప్పుడు కట్నం మూడు లక్షలంటే మాటలా?" పరమేశం గొణుక్కుంటూ వాళ్ళని దీనంగా అడిగాడు.

మొత్తం సొమ్ము ఏర్పాటు చేయండి. లేదా మూడురోజుల్లో పిల్లని తీసుకెళ్ళే ముందు ముట్టచెబుతామని స్టాంపు పేపరుమీద రాసివ్వండి' పెళ్ళికొడుకు తండ్రి హుకుం జారీ చేశాడు. నాకు చాలా ఉక్రోషంగా ఉద్వేగంగా ఉంది.

'ఛీ!ఛీ! వీళ్ళెంత అసంబద్ధంగా, అసందర్భంగా మాట్లాడుతున్నారు. మనుషుల్లో స్థిరత్వం లేకుండా పోయింది. ఎప్పుడెలా మాట్లాడాతారో, ఎప్పుడెలా మారిపోతారో తెలియకుండా పోయింది. కట్నం లేకుండా ఈ పెళ్ళి జరుగుతోందనీ ఎంతో ఆనందించాను. అన్ని సంబంధాలకంటే డబ్బు సంబంధం ఒక్కటే...."

"సరే ! అలాగే నోటుగా రాసిస్తాను. కార్యక్రమం జరగనివ్వండి" పరమేశం సుదీర్ఘమైన ఆలోచనతో ఒక నిర్ణయానికొచ్చాడు. స్టాంపు పేపర్లు తీసుకురావడానికి ఎవరినో వెంటనే పురమాయించాడు. అతిథుల్లో ఒక ప్లీడరుగారితో ఒప్పంద పత్రం రాయించడానికి ఏర్పాటు చేశాడు. శ్రీనివాస్ పెళ్ళి పీటల మీద కూర్చోవడానికి ఒప్పుకున్నాడు.

సన్నాయిమేళం 'నీ లీల పాడెద దేవా' అంటూ నిడువైన రాగం తీస్తోంది. విడిది ఇంట్లోంచి భారమైన హృదయాలతో బయటపడ్డాం. పెళ్ళికూతురు గదిలోకి దిగులుపడుతూ వచ్చాం. పరమేశంలో ఆందోళన, ఆరాటం, వాటిని అణచుకుంటూ ఆలోచిస్తున్నాడు.

"అంత డబ్బు మూడురోజుల్లో ఎలా ఏర్పాటు చేస్తావురా? నీ స్థోమత, స్థాయి..?" అనుమానం చావక పరమేశాన్ని అడిగాను.

"ఏదో చేయాలిరా. ఈ పెళ్ళి మాత్రం ఆగకూడదు. ఇంటిమీద కొంత అప్పు పుడుతుందేమో చూస్తాను. మిత్రుల్ని ఎవరినైనా కదిలించి..." పరమేశం మాటలతో 'వీడికి ఏదో రకంగా సాయపడాలి' అన్న ఆలోచన నాలోనూ కలిగింది.

"నాన్నగారూ! మీరేమీ అనుకోనంటే ఒక్క మాట" అంతవరకూ గదిలో ఒక మూలగా కూర్చుని, మౌనముద్రలో ఉన్న ప్రమీల గొంతు విప్పింది.

'ఏంవిటమ్మా! చెప్పు?' పరమేశం కూతురువైపు నిర్లిప్తంగా చూశాడు.

'నేనీ పెళ్ళి చేసుకోను' స్థిర స్వర గంభీరంతో స్ఫుటంగా పలికింది. ప్రమీల తల్లి ఏడుపు లంకించుకుంది. చుట్టూ బంధువులు సానుభూతిగా చూస్తున్నారు.

'ఏంవిటమ్మా! నువ్వు నా ప్రాణం తీయడానికే పూనుకున్నావా? పరమేశం నిస్ప్రాణగా గోడకు చేరగిలపడుతూ అన్నాడు.

"మిమ్మల్ని, నన్నూ రక్షించుకోవాలనే నా ఉద్దేశ్యం. మీరేం చేసినా, మీరేం చెప్పినా ఇక నేనీ పెళ్ళిచేసుకోను. అంతే కాదు. పెళ్ళికొడుకు, అతని తల్లితండ్రులు కట్నం కారణంగా ఈ పెళ్ళి ఆపివేశారని ఇప్పుడే నా స్నేహితురాలు సెల్‌ఫోన్లో పోలీసులకు ఫోను చేశాను" ప్రమీల చాలా నిశ్చలంగా, నిబ్బరంగా అంది.

ఇరువైపులా బంధువులు, స్నేహితులు అంతా నివ్వెరపోయారు. నేను అబ్బురపడుతూ ప్రమీలవైపు చూశాను. ప్రమీల మాట వినగానే పరమేశం తలపట్టుకున్నాడు.

"పిచ్చిదానా ! నీకు బుర్రా, బుద్ధీ, జ్ఞానం ఉన్నాయటే, ఎంత పని చేశావే? నీకు పెళ్ళయ్యే యోగం ఉందటే? ఎవడు పెళ్ళి చేసుకుంటాడే నిన్ను? ఇప్పుడే వెళ్ళి పోలీస్ స్టేషన్లో క్షమాపణ చెప్పుకుంటాను." పరమేశం కూతురుపై ఇంతెత్తున ఎగురుతూ చివాట్లు పెట్టాడు. స్టేషనుకు వెళ్ళడానికి సిద్ధపడ్డాడు.

'పోలీసులొచ్చినా, రాకపోయినా నేనీ పెళ్ళి చేసుకోను, బలవంతంగా నాకీ పెళ్ళి చేయలేరు' ప్రమీల మరింత ఖచ్చితంగా చెప్పింది.

పెళ్ళికూతురు మాటలు, నిర్ణయం, క్షణాల్లో కళ్యాణమండపం అంతా అల్లుకు పోయాయి. ఆ అలజడిలో సన్నాయిమేళం ఆగిపోయింది. సందడి ఆగిపోయింది. ఎవరికివారు తమలో తాము మాట్లాడుకుంటున్నారు! కొందరు ఇక ఈ పెళ్ళి జరగదని తిరుగుముఖాలు

పడుతున్నారు. ఇంతలో కట్నం ఒప్పందానికి స్టాంపు పత్రాలు ఒక వ్యక్తి తీసుకువచ్చాడు.

పెళ్ళికూతురు ప్రమీల పోలీసులకి ఫోను చేయడం కబురు మగ పెళ్ళివారికి ఎలా అందిందో, ఏం జరిగిందో, వాళ్ళలో ఏ కలకలం చెలరేగిందో, కొద్ది నిముషాల్లోనే అక్కడ దృశ్యం మారిపోయింది. పెళ్ళికొడుకు తల్లితండ్రీ, ఇద్దరు అన్నయ్యలు హుటాహుటిన పెళ్ళికూతురి గదిలోకి వచ్చారు. చటుక్కున పరమేశం చేతులు పట్టుకున్నారు.

"బావగారూ! ఎక్కడో ఏదో తప్పు జరిగిపోయింది. ఏ దుష్టగ్రహానికో కన్నుకుట్టి ఈ పెళ్ళికి ఆటంకం కలిగించింది. ఎవరివో చెప్పుడు మాటలవల్ల ఇంకా కట్నం కావాలని మిమల్ని ఇబ్బంది పెట్టాం. జరిగింది మరచిపోండి. పెళ్ళికొడుకు మమ్మల్ని చెడామడా తిడుతున్నాడు. ప్రమీలని తప్ప మరో అమ్మాయిని పెళ్ళి చేసుకోనంటున్నాడు. మాకే బోలెడు ఆస్తి ఉంది. కట్నంతో పనేమిటి? లేవండి. ముహూర్తం దాటిపోకుండా ఈ పెళ్ళి జరిపించేద్దాం..."

వియ్యంకుల వారి మాటల అందరికీ విస్మయం కలిగించాయి. పరమేశం వాళ్ళ మాటల్ని నమ్మలేనట్లుగా... నాటకంలోని పాత్రధారిలా నిశ్చేష్టుడై ఉండిపోయాడు. సన్నాయి మేళం కొత్త కీర్తనకై గొంతు సవరించుకుంది. బ్యాండు మేళం జతకలిపింది. కళ్యాణ మండపం మళ్ళీ కళకళలాడింది. అప్పటికి ముహూర్తానికి ఇంకా కొంత వ్యవధి మాత్రమే ఉందనీ పురోహితుడు తొందరపెట్టాడు.

అందరూ పెళ్ళిమండపం వైపు కదిలారు. పెళ్ళికూతురు ప్రమీలమాత్రం తన గదిలోంచి కదల్లేదు. 'ఏదో నాటకంలోలా, మగపెళ్ళివారి మనసులు మారినా, నేనీ పెళ్ళి చేసుకోను' ఆమె ఖరాఖండిగా చెప్పింది. పరమేశం నచ్చచెప్పాడు. ప్రమీల తల్లి బ్రతిమాలింది. బంధువులు, స్నేహితులు ఒకరి తరువాత ఒకరు శతవిధాల ప్రయత్నించి విఫలమయ్యారు. నేనూ ఓడిపోయాను.

'అంకుల్, నా నిర్ణయం మారదు. నాకీ పెళ్ళివద్దు' ప్రమీల భీష్మించుకుని కూర్చుంది. పరిస్థితి పెళ్ళికొడుకు శ్రీనివాస్‌కు అర్ధమయిందేమో అతను పెళ్ళి కూతురు గదిలోకి వచ్చాడు.

"సారీ! ఎందుకిలా జరిగిందో నాకూ అర్ధం కావడంలేదు. నేను మౌనంగా ఉండిపోవడమే ఈ రభసకూ, అనర్థానికి కారణం అయిందనుకుంటాను.!"

ప్రమీల ముందు సిగ్గుపడకుండా పెళ్ళికొడుకు క్షమాపణ చెప్పాడు. ప్రమీల కొద్ది క్షణాల వరకూ గొంతు విప్పలేదు. తటాలున తలెత్తి పెళ్ళికొడుకు ముఖంలోకి సూటిగా చూసింది. శాంత గంబీర స్వరంతో పలికింది.

"ఎవరి పెళ్ళిలోనో నన్ను చూశానన్నారు. నా అందానికి మోజుపడి, ఇష్టపడి పెళ్ళి చేసుకుంటానన్నారు. పెద్దలు సరేనన్నారు. మాకే బోలెడు ఆస్తి ఉంది. కట్నం అవసరం లేదన్నారు. అయినా మా నాన్నగారు లక్ష కట్నం రూపేణో, ఖర్చుల రూపేణో ఇచ్చారు. లాంఛనాలు జరిపించారు. మీ వాళ్ళు ముహూర్తానికి ముందు మళ్ళీ కట్నం కావాలన్నారు. మీరు మౌనం వహించారు. వాళ్ళ మాటల్ని ఖండించలేదు. అంటే నా రూపం కంటే, నా అందం కంటే, నా వ్యక్తిత్వం కంటే మీకు

కట్నం ఎక్కువనేగా అర్థం? నేను తిరగబడి పోలీసులకి ఫోను చేయగానే, మీ వాళ్ళు మళ్ళీ మాట మార్చారు. మీరేమో తప్పును ఒప్పుకుంటున్నాననీ, నన్ను పెళ్ళి చేసుకోవడానికి సిద్ధమేనని అంటున్నారు. ఏమనుకోవాలి? ఏది నమ్మాలి? మీ మాటల్ని ఎలా నమ్మాలి? నేనూ ఈపెళ్ళికి సిద్ధమే. కానీ ఒక షరతు. ఆషరతు మీరు అంగీకరిస్తే, దాన్ని మరో ఆలోచన లేకుండా అమలు పరిస్తే మిమ్మల్ని నేను పెళ్ళి చేసుకుంటాను' ప్రమీల గొంతులో ఒక స్థిత ప్రజ్ఞత ధ్వనించింది.

అందరి ముఖాల్లోనూ ప్రశ్నార్థకం? ప్రమీల షరతు ఏమిటది? ఏమై ఉంటుంది? పెళ్ళికొడుకు శ్రీనివాస్ ఎలా ప్రతిస్పందించాలో అన్నట్లుగా కాస్సేపు నిశ్చలంగా ఉండిపోయాడు. ఒక నిర్ణయానికొచ్చినట్లుగా...

"నువ్వే షరతు పెట్టినా, నేను ఒప్పుకుంటున్నాను. దాన్ని అమలు పరచి నిన్ను పెళ్ళి చేసుకుంటాను. ఈ జనం సాక్షిగా, ఈ కళ్యాణమండపం సాక్షిగా, నా మనస్సాక్షిగా చెబుతున్నాను!"

శ్రీనివాస్ వాగ్దానం చేశాడు. పెళ్ళి జనం అందరూ ప్రమీల షరతు ఏమిటన్న ఆత్రంతో తల మునకలవుతున్నారు.

"మీకు బోలెడు ఆస్థి ఉంది. ఎన్నో ఆదాయాలున్నాయి. మీ వాళ్ళ ఆస్థి, ఆదాయాల మొత్తంలో మీకు ఎంత భాగం ఉందో, ఎంత భాగం వస్తుందో, అంతా నిర్ణయించి ఆ ఆస్థి మొత్తం నా పేరున పెళ్ళికి ముందే రాయించండి. ఆ ఏర్పాట్లు ఏవో ఇప్పుడే జరిగేలా చూడండి. మిమ్మల్ని నేను పెళ్ళి చేసుకుంటాను."

ప్రమీల మాటలకి మగపెళ్ళివారు ముఖముఖాలు చూసుకున్నారు. కొందరు విస్తుపోయారు. కొందరు అవాక్కయ్యారు. కొందరు ఇదేం విడ్డూరం అన్నట్టు చూశారు. పెళ్ళికొడుకు శ్రీనివాసు మాత్రం చిత్తరువులా ప్రమీలవైపు కళ్ళప్పగించి చూస్తున్నాడు.

నేనూ ప్రమీలని ఆశ్చర్యంగా చూశాను. మెచ్చుకోలుగా మనసులో అభినందించాను. పెళ్ళికొడుకు ఆస్థి మొత్తం ముందుగా తన పేరన రాయమంటోంది ప్రమీల! ఎందుకు రాయమంటోంది? ఇది కొత్తగా ఉంది కదూ?

ఆమెలో ఏ నమ్మకానికి బీటలు పడిందో! ఏ విశ్వాసం దెబ్బతిన్నదో? ఏ భవిష్యత్తు గురించి, ఏ భద్రత గురించి... ఏ భరోసా గురించి... ఆమె మనసు బెంగపడిందో? నిజానికి ఈ పురుషాధిక్య ప్రపంచంలో కట్నం ఇచ్చి పెళ్ళి చేసి అత్తారింటికి పంపే ఆడపిల్లలకి ప్రమీల కోరినట్టు, పెళ్ళి కొడుక్కిసంబంధించిన ఆస్థి, పెళ్ళికూతురు పేర్న ముందే రాయించి, పెళ్ళి చేస్తే ఆడపిల్లల జీవితాలకు కొంత భద్రతా, భరోసా కలుగుతాయేమో!"

ఇంతకూ ప్రమీల పెళ్ళి జరుగుతుందా? ఆ అమ్మాయి కోరిక నెరవేరుతుందా? శ్రీనివాస్ స్పందించాడుగా... మరి...?

❀ ❀ ❀ ❀ ❀ ❀

(ఆంధ్రప్రదేశ్ మంత్లీ, జూన్ - 2002)